క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, పి.సురేష్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గండి అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే



చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామిని ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ఈఎన్‌సీ బాలూ నాయక్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఒంటె వాహనంపై సంజీవరాయుడు



రాజుపాళెం : వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమద్వ్రత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరాయ స్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, హోమం తదితర పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన ఒంటె వాహనంపై ఆశీనులను చేసి ఊరేగించారు. ఆలయ ఈఓ బీవీ నరసయ్య, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, సర్పంచ్ రాధా, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, భజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



రాజుపాళెం : వెల్లాల క్షేత్రంలో 15 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్టించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు అర్చకుడు పవన్ చేశారు. ఆలయ ఈఓ బీవీ నరసయ్య, ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన మధు అనే భక్తుడు సహకారంతో అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు.

రేపు అగస్త్యేశ్వరాలయంలో చండీహోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 6 గంటలకు లోక కల్యాణార్థం చండీ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఇన్‌చార్జి ఈఓ శంకర బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 7 గంటలకు గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : సమ్మెలో ఉన్న సర్వశిక్ష, అంగన్‌వాడీ విభాగాల్లో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర నాయకులు సీవీ ప్రసాద్ కోరారు. ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆదాయ పన్ను లెక్కింపుపై అవగాహన సదస్సులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ శాసనమండలి సభ్యులు మార్పు బాలక్రిష్ణమ్మ వర్ధంతి జనవరి 6న కడపలో నిర్వహించి సదస్సులను ప్రారంభిస్తామని ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు చెంగల్‌రెడ్డి, అలీఖాన్, ఈశ్వరచంద్ర తెలిపారు.

● శ్రీ చక్ర తాళ్వార్‌కు అభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : ధనుర్మాసపు ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో చక్రతాళ్వార్‌కు అభిషేకం నిర్వహించారు. తొలుత ప్రత్యేక తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామిని కొలువుదీర్చి పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ దేవతామూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. చక్ర తాళ్వార్‌కు పుష్కరిణిలో అభిషేకం చేశారు. అనంతరం దేవతామూర్తులతో సహా చక్ర తాళ్వార్‌ను ఊరేగింపుగా ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి మరునాడు సంప్రదాయంగా ఈ పూజలు నిర్వహిస్తారు.

● భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం



తమలపాకులతో హనుమంతునికి పూజ



హనుమద్ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు రఘువీరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అలంకారాలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని ఆలయ ఆరాధన మండపంలో కొలువుదీర్చి భక్తులు తెచ్చిన నాగవల్లీ దళాలు (తమలపాకులు)తో వ్రతం ఆచరించారు. అనంతరం మొక్కులున్న వారు తెచ్చిన నాగవల్లీ దళాలతో స్వామికి అర్చన చేశారు. ఈ లక్ష నాగవల్లీ దళాల పూజలో స్థానిక భక్తులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మానవత సేవలు అందించేందుకు కృషి

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలకు వివిధ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు బాలాజీలు తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ప్రముఖ డాక్టర్ మోహన్ డయాబిటీస్ సెంటర్ ద్వారా వివిధ రకాల మధుమేహ వ్యాధికి సంబంధించిన వైద్య పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా ఎంతోమంది అభాగ్యులకు, అనాథలకు, వృద్ధులకు, వికలాంగులు, నిరాశ్రయులకు సేవలు అందించడం జరుగుతోందన్నారు. అంతేకాక కార్పొరేట్ ఆసుపత్రుల ద్వారా పేద, సామాన్య ప్రలకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందుకు సహాయ సహకారాలు అందించిన వారికి మానవత స్వచ్ఛంద సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మానవత సంస్థ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో వారికి మెమెంటో ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ సెంటర్ మేనేజర్ సుధీర్, వైద్య సిబ్బంది, మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మహా సభలను విజయవంతం చేయండి

వేంపల్లె : జిల్లాలోని ప్రొద్దుటూరులో జనవరి 7, 8వ తేదీలలో జరిగే మహా సభలను జయప్రదం చేయాలని వేంపల్లె భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి బాలాజీలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మహా సభలకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్మికుల ఐక్యత, సమస్యలు, వాటి పరిష్కారం తదితర అంశాలపై మహాసభలు జరగనున్నట్లు వారు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడప వైఎస్సార్ సర్కిల్ : కడప నగరంలోని నబికోటలో ఆదివారం గుల్‌ఖాన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సయ్యద్ సర్ఫరాజ్, మెహతాబ్ బేగం, ఫౌజియా బేగం, మహమ్మద్ సైఫుల్ల, అజాజ్ అహ్మద్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు మహ్మద్ ఆలీఖాన్, గుల్‌ఖాన్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎజాజ్ అహ్మద్, ఉపాధ్యక్షుడు కరిముల్లా ఖాన్, కార్యదర్శి ఎస్.ఏ.అలీమ్ అసద్, కోశాధికారి జిలాన్, సంయుక్త కార్యదర్శి అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : స్థానిక తొగటవీరక్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక తమ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఈడెం లక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుండా నాగరాజు, ప్రధాన కార్యదర్శి గంగారపు రాధాకృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడు తిప్పాబత్తిన గోపాలదాసు, పల్లా విశ్వేశ్వరయ్య, కోశాధికారి ఉమ్మడిశెట్టి నందగోపాల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణ మండపంలో దేవాంగకల్యాణ మండపం, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం, ప్రధాన కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, కార్యదర్శి కాటం రామకృష్ణ, కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు వుట్టి తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి మచ్చా వెంకట సుబ్బరాయుడు, కోశాధికారి వెంకటాచలపతి, గంగా జలందర్, మనోహర్, వెంకట లక్షుమయ్య, దేవాంగ కుల ప్రముఖులు పాల్గొన్నారు.

పుస్తకాలు.. మంచి నేస్తాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కడప కల్చరల్ : పుస్తకాలు మంచి నేస్తాలని వక్తలు తెలిపారు. సూర్య నారాయణ చారిటబుల్ ట్రస్ట్ రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి ఆధ్వర్యంలో ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి రచించిన 'నాలో నువ్వు (కవిత్వం)', 'సాహిత్యంలో సమాజం (విమర్శ)' పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింత సుధాకర్ మాట్లాడుతూ ఈ పుస్తకాలు భావితరాలకు ఉపయుక్తమన్నారు. ఇంటాక్ కడప చాప్టర్ లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ రచయితను అభినందిస్తూ పది వేల విలువ చేసే పుస్తకాలు తాను కొనుగోలు చేసి పలు గ్రంథాలయాలకు పంపిణీ చేస్తామన్నారు. సూర్య చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్ఆర్‌వి డాక్టర్ గోర్ల సూర్యనారాయణ మాట్లాడుతూ 'నాలో నువ్వు' పుస్తక రచనలో నిద్రలేపే, ప్రశ్నించేతత్వం కనిపిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య 'నాలో నువ్వు' పుస్తక పరిచయం చేస్తూ నూతన పదబంధాలతో కవిత్వాన్ని సృష్టిస్తున్న ఈశ్వరరెడ్డి గతతరానికి, భవిష్యత్తు తరానికి వర్తమాన వారధిలా పని చేస్తున్నారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్ సాహిత్యంలో సమాజం పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఎలాంటి భావజాలాలకు లోనుకాకుండా సాహిత్యాన్ని సాహిత్యంలా చూసేలా ఈ పుస్తకం దోహద పడతుందన్నారు. రచయిత ఆచార్య ఈశ్వర్‌రెడ్డి స్పందిస్తూ జనం మనసుల్లో మెదిలేవే నా అక్షరాలన్నారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాశ్చ్య పరిశోధన సంస్థ సంచాలకులు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, అభ్యుదయ రచయితల సంఘం గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.సంజీవమ్మ, అరసం కడప జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజగోపాల్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్, సూర్యచారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఎం.ప్రభాకర్ నాయక్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దనరాజు, బ్రౌన్ కేంద్రం సంచాలకుడు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, సాహితీవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆట-పాటల సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపులో భాగంగా ఆట–పాటల కార్యక్రమం సందడిగా నిర్వహించారు. పులివెందులకు చెందిన ఎస్‌కే డ్యాన్స్ అకాడమి మాస్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు, యువకులు తమ నృత్యాలతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. సందర్శకులు తమ కరతాళ ధ్వనులతో వారిని ప్రోత్సహించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో క్రిస్మస్ పండుగలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మదనపల్లెకు చెందిన శ్రీసూర్య డ్యాన్స్ అకాడమికి చెందిన శిష్య బృందం నిర్వహించిన జానపద, వెస్ట్రన్ నృత్యప్రదర్శనలు అందరిని అలరించాయి. తదితర పాటలకు వేసిన స్టెప్పులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ సూర్యకుమార్, శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గణితాన్ని ఇష్టంతో అభ్యసించాలి



విద్యార్థిని గీతికకు బహుమతి అందజేస్తున్న ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : గణితాన్ని కష్టంతో కాకుండా ఇష్టంతో అభ్యసించాలని కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గీతాశ్రమంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని గణితఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్తూరు జిల్లాకు చెందిన గణిత ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ తన శిష్య బృందంతో నిర్వహించిన గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమంలో తమ అద్భుత జ్ఞాపక శక్తితో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులకు గణిత దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి వైవీఎస్ మున్సిపల్ బాలికల హైస్కూల్ విద్యార్థిని గీతిక(ప్రొద్దుటూరు), ద్వితీయ, తృతీయ బహుమతులను సమాన మార్కులతో రామ్‌చరణ్ జెడ్పీహెచ్ఎస్ (పలుగురాళ్లపల్లి), తేజస్విని జెడ్పీహెచ్ఎస్ (బాలికల)(ఎర్రగుంట్ల), నాలుగు, ఐదు స్థానాల్లో సమాన మార్కులతో వరలక్ష్మి జెడ్పీహెచ్ఎస్(మైలవరం), భార్గవ జెడ్పీహెచ్ఎస్(నల్లపురెడ్డిపల్లె)లు నిలిచారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులతోపాటు ఐదుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత ఫోరం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ మెంబర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రొద్దుటూరు డివిజన్ గౌరవాధ్యక్షుడు ఇమాం హుసేన్, డివిజన్ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కరీం, కోశాధికారి సంజీవ రెడ్డి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీలో బాలికలు



ప్రతిభ కనపరచిన క్రీడాకారులతో నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్–14, –16 విభాగాల్లో బాలబాలికలకు 60 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, బ్రాడ్ జంప్, జావెలిన్‌త్రో తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా తరఫున గుజరాత్‌లో జరగనున్న నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొననున్నారు. పోటీలను బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా, వ్యాయామ అధ్యాపకులు వెంకటసుబ్బయ్య, లక్ష్మి, అంకారావు, శ్రీనివాసులు, ఓబయ్య, ప్రణవి, నాగేశ్వరరావు, రామాంజి తదితరులు పర్యవేక్షించారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రేణిగుంటలో నిర్వహించిన జోన్–4 క్రీడల్లో ప్రతిభ చాటారని పీఈటీ అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. రేణిగుంట గిరిజన గురుకుల పాఠశాలలో జరిగిన జోన్–4 క్రీడల్లో అజయ్‌నాయక్ చెస్‌లో ప్రథమ స్థానం, 200 మరియు 400 మీటర్ల పరుగుపోటీల్లో తృతీయ స్థానం సాధించారన్నారు. అలాగే వెంకటేష్ చెస్‌లో తృతీయ స్థానం పొందాడన్నారు. కాళహస్తి ఎమ్మెల్యే మధుసూధనరెడ్డి చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్ అందుకున్నారని అనిల్ తెలిపారు. ఇరువురు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త పెరియార్



పెరియార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : కుల, మత రహిత సమాజం కోసం అలుపెరగని పోరాటం చేసిన ద్రావిడ వీరుడు పెరియార్ ఇవి రామస్వామి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య తెలిపారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో పెరియార్ 50వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.సుబ్రహ్మణ్యం, హేతువాద సంఘం నాయకులు నాగార్జున రెడ్డి, డీహెచ్‌పీఎస్ నాయకులు మునెయ్య, సీపీఐ నగర నాయకుడు సావంత సుధాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు ఇలియాస్ బాషా

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాషా పేర్కొన్నారు. ఆదివారం కడప ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్‌సీ, డీఏ బకాయిల చెల్లింపులు పదవీ విరమణ తరువాత చెల్లిస్తామని కొత్త ఆనవాయితీకి తెరలేపడం సరికాదన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను ప్రవేశపెట్టకుండా, జీపీఎస్‌ను అసెంబ్లీలో ఆమోదించడం తగదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సురేష్ బాబు, రవిశంకర్‌రెడ్డి, జయరామయ్య, సుదర్శన్‌రెడ్డి, జిల్లా నాయకులు మహబూబ్‌బాషా, వీరశేఖర్, పెంచలయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకురాలుకు సన్మానం



ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న అధ్యాపకులు

వైవీయూ : గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీజీటీఏ) ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతను సన్మానించారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు గ్రహీత డాక్టర్ పి. శచీదేవి, వైవీయూ పాలకమండలి సభ్యురాలుగా ఎంపికైన జె.వెంకటలక్ష్మిలను సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా మాట్లాడి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, జీసీజీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి బీదం విజయ్‌కుమార్, అధ్యాపకులు మధు, సుందరేశ్వర్, రమ పాల్గొన్నారు.

ఘనంగా మహమ్మద్ రఫీ జయంతి



మహమ్మద్‌రఫీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అభిమానులు

కడప ఎడ్యుకేషన్ : గాయకుడు మహమ్మద్ రఫీ 99వ జయంతిని రాయల్ కరీం సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహమ్మద్ రఫీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాయల్ సేవా సమితి అధ్యక్షులు రాయల్ కరీముల్లా మాట్లాడుతూ మహమ్మద్ రఫీ గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అన్వర్‌బాషా, గోరాధా, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవగా గుర్తించాలి

వేంపల్లె : ప్రతి ఒక్కరూ మానవ సేవే మాధవ సేవగా గుర్తించాలని ఆల్ అమీన్ సొసైటీ వ్యవస్థాపకులు, మాజీ జెడ్పీటీసీ, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా తెలిపారు. ఆదివారం స్థానిక బాషా ఆసుపత్రిలో సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్‌చే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలతోపాటు పట్టణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కొన్ని దశాబ్దాలుగా తమ ఆల్ ఆమీన్ సొసైటీ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజల సహకారం కూడా ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాబా షరీఫ్, స్పెషలిస్ట్ డాక్టర్లు, విద్యా వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



సాదిక్ అలీ



సంజీవరాయుడు

కడప ఎడ్యుకేషన్ : ఎస్టీయూ నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కడప ఎస్టీయూ భవన్‌లో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాలగంగిరెడ్డి అధ్యక్షతన కడప అర్బన్, రూరల్ మీటింగ్ నిర్వహించి ఈ ఎన్నికను నిర్వహించారు. ఇందులో ఎస్టీయూ నగరశాఖ అధ్యక్షుడిగా సాధిక్ అలీ, ప్రధాన కార్యదర్శిగా సంజీవరాయుడు, ఆర్థిక కార్యదర్శిగా అస్లంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సురేష్‌బాబు, పరిశీలకులుగా జయరామయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్‌బాషా, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌బాషా, జిల్లా మైనార్టీ కన్వీనర్ నజీబుల్లా, రీజనల్ కన్వీనర్స్ వాజిద్, బాబు పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా తనను నియమిస్తూ గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కామినేని ప్రవీణ్‌నాయుడు తెలిపారు. పార్టీ బలోపేతానికి తాను చేస్తున్న కృషిని గుర్తించి ఈ నియామకం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి వెంకటసుబ్బారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి కాశిరెడ్డినాయన ఆరాధన

ఖాజీపేట : భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఖాజీపేట మండలం పత్తూరులో ఉన్న కాశిరెడ్డి నాయన ఆలయంలో ఏటా వైభవంగా ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తారు. 25వ తేదీ నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నారు.